

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**మగాడు** మొదట దొంగిలిస్తాడు. తర్వాత తీసుకుంటాడు. ఆ పైన భరిస్తాడు. ముద్దు అని ఎక్కడో చదివాను.

'నీకు ఎప్పుడైనా కావలిస్తే నాతో చెప్పు.. మొహమాట పడకు' అన్నాడు గతంలో.

చెప్పెయ్యనా? అనుకుంటూ వుండగానే, అతను లేచి "కం" అన్నాడు.

'గదిలోకా?' అని అడిగేలోపే "ఐ విల్ డ్రాప్ యూ ఎట్ యువర్ ప్లేస్" అని కారు తాళాలు తీసుకుని నడిచాడు.

నేను కొంచెం డిజప్పాయింట్ అయ్యాను. కానీ అతన్నీ తప్పు పట్టలేను. లాస్ట్ టైం కలిసినప్పుడు మూడ్ లేదు అని కచ్చితంగా  చెప్పగలిగినప్పుడు, ఇప్పుడు 'నాకు మూడ్ వస్తోంది. దగ్గరికి తీసుకో.. ముద్దు పెట్టుకో' అని ఎందుకు చెప్పకూడదూ? సమాన హక్కులు కావాలి అన్నింటా అని గోల పెట్టి పెట్టి ఇలా చీరల్లోంచి, ప్యాంట్‌లలోకీ, రకరకాల ఉద్యోగాలలోకీ వచ్చినప్పుడు ఈ తెగింపులోకి ఎందుకు రాలేము? కోరిక ఇద్దరికీ సమానమేకదా.

అతను ఆగి "ఏంటి?" అన్నాడు.

నేను అతన్ని అందుకోడానికి నా మునివేళ్ళ మీద నిలబడి అతని పెదవులని అందుకోవలసి వచ్చింది. నిజంగా స్త్రీ ఇష్టపడి ఇచ్చే ముద్దుకీ, స్వీకరించే ముద్దుకీ వ్యత్యాసం అతనికి తెలుస్తుంది.

"నువ్వు ఇస్తేనే బావుంటుందని ఎదురుచూస్తున్నా" అన్నాడు.

ఆ రాత్రి మేం ఇద్దరం కోరికల జ్వలిత తోరణాలని వెలిగిస్తూ, కాలాన్ని కర్పూరం చేసాం. ఒక పికిలి పిట్ట అదే పనిగా కూస్తూ కాంక్షలని రెచ్చగొడితే, ఓ వసంత యామిని వలపు ధూపాలని వెదజల్లింది. స్నిగ్ధ  కోమలమైన శరీరానికి గమకాలు  నేర్పే గురువు దొరికితే కచేరీ తేనెలూరే విభావరిగా మారుతుందిగా.

కవిత్వం శృంగారంలో వైరాగ్యంలో సమానంగా కలుగుతుంది. రెండూ హృదయానికి రాపిడి పెట్టేవి. రేపనేది లేదు. ఇదే శాశ్వతం అని చెప్పేవి. రాగానికీ విరాగానికీ ఒక్క అక్షరమే తేడా.

"గోల్ గప్పా ఒక్కసారిగా మొత్తం నోట్లో పెట్టుకుని తింటేఎంత బావుంటుందో నిన్ను అలా ముద్దు పెట్టుకుంటే అంత బావుంటుంది" అన్నాడు ద్వారక.

కార్‌లో అతనివైపు ఒరిగి, మెడ దగ్గరగా నా తల పెట్టి "ఆంటీ పెళ్ళి గురించి నా అభిప్రాయం అడిగారు. నిన్న మావయ్యా అత్తయ్యా, ద్వారక పేరెంట్స్‌తో మమ్మల్ని మాట్లాడమన్నావా? అని అడిగారు" అన్నాను.

"నాకు కనీసం ఒక ఏడాది గడువు ఇవ్వు" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు.

"మనకి ఆ లోపుగానే ఒక బ్లూబెర్రీగాడు వచ్చేస్తాడనా?" అని నవ్వుతూ అడిగాడు.

"పెంచుకుందాం అన్నావుగా?" అన్నాను.

"థాంక్‌గాడ్ నా మీద ఆ మాత్రం నమ్మకం వుంది.ఈ పెద్దవాళ్ళు ఆ నమ్మకాన్ని బ్రేక్ చెయ్యాలని చాలా చూస్తారు. ఆ ట్రాప్‌లో పడిపోకు" అన్నాడు.

'నేటికి రేపొక తీరని ప్రశ్నా.. రేపటికి మరునాడొక ప్రశ్న. కాలమనే గాలానికి చిక్కి.. తెలియని ప్రశ్నలు ఎన్నెన్నో.. ఎన్నెన్నో..' అప్రయత్నంగా నా మనసులోకి ఈ పాట వచ్చింది.

'అదిగో నవలోకం. వెలసే మనకోసం.', 'పరువాలు తాకితే చాలు.. మరిగేను కాదా ఈ హృదయం'.. తనువా? హరి చందనమా? మనసా అది మకరందమా?' అన్న పాటలు ఎగిరిపోయాయి.

'కాలమనే గాలానికి చిక్కి.. తెలియని ప్రశ్నలు ఎన్నెన్నో.. ఎన్నెన్నో' అనే పాట వినిపిస్తోంది. ఇదే జీవితం.

పరిమళా, అవ్లిన్ నాకన్నా ముందే వెళ్ళిపోయారు. అత్తయ్యా, మావయ్యా కూడా ముభావంగా వున్నారు. నేను ధీరజ్ ఫోన్‌కి కాల్ చేసాను. అతను తియ్యలేదు. బహుశా ఇండియాలో ఏ అర్ధరాత్రో అయివుంటుంది. తెల్లారి తీస్తాడులే అనుకున్నాను.

హనీష్ కాల్ చేసినప్పుడు "డాడీ కోసం సన్‌గ్లాసెస్, మమ్మీ కోసం స్మార్ట్ వాచ్ పంపించాను. ఇచ్చెయ్యి" అన్నాడు.

"నేనూ అత్తయ్య కూడా షాపింగ్‌కి వెళ్ళబోతున్నాం. వసుంధరకి రెండు పచ్చిమిర్చి కూడా, పేస్ట్ చేసిచ్చే హాండ్ గ్రైండర్‌లాంటివి ఇస్తే, కె.బి.సిలో సాత్ కరోడ్ వచ్చినట్లు పొంగిపోతుంది. లక్కీ చాప్ కదూ!" అన్నాను.

"నీ ద్వారక ఏమంటున్నాడు? పెళ్ళి ఈ ఇయర్ ఎండింగ్‌లో పెట్టుకుంటే బెటర్. నేను రాగలను" అన్నాడు.

"ఓ. నువ్వు నా పెళ్ళి డిసైడ్ చేసేసావా?" అన్నాను. వాడింకా నా కళ్ళముందు 'బచ్చాగాడు.'

"అవును ఇండియాలో గోపాలాలూ, భూపాలాలూ కన్నా బెటర్. ఇంకో మాట నిన్న ఓ ఇంటర్వ్యూలో అతనిచ్చిన రిఫరెన్స్ నాకు పనికొచ్చింది. బావ పనికొస్తాడు. డాడీకి నేనే కాల్ చేసి చెప్తాం జాబ్ వచ్చినట్లు అనుకుంటున్నా" అన్నాడు.

"ఓ కంగ్రాట్స్" అన్నాను. అది ద్వారక వల్ల అవడం, నాకు ఆనందాన్నిచ్చింది.

సాయంత్రం కేక్స్ కొనుక్కుని ద్వారక వచ్చాడు. అత్తయ్య కిచెన్‌లో ఏక్టివ్‌గా వుంటోంది. టీ, సమోసాలూ తీసుకొచ్చింది.

అందరం కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు హనీగాడీ జాబ్‌కి హెల్ప్ చేసినందుకు ద్వారకకి థాంక్స్ చెప్పాను.

అత్తయ్య ద్వారకతో "అబ్బాయ్ డోంట్ థింక్ అదర్ వైజ్. పెళ్ళి విషయంలో  అనుకున్నాక డిలే చెయ్యకండి. తరువాత కాంప్లికేషన్స్ వచ్చాకా బాధపడి ప్రయోజనంలేదు. ఎన్నో చూసిన ఎక్స్‌పీరియన్స్‌తో చెపుతున్నాను. గెట్ మేరీడ్ సూన్" అంది.

నేను షాక్ అయి, ద్వారకవైపు భయంగా చూసాను. ఎలా రిసీవ్ చేసుకుంటాడో అని.

"ఎస్ ఆంటీ మీ పెద్దల అభిప్రాయాలని నేను గౌరవిస్తాను" అన్నాడు.

మావయ్య కూడా "మా బావమరిదికి ఒక్కతే అమ్మాయి, మధ్య తరగతిలో పై తరగతి దానికి ఇంట్రెస్టు లేక పై చదువులకి అమెరికా రాలేదు కానీ, చాలా తెలివైనది. ఇల్లు దాని చేతిలోపెడితే నిశ్చింతగా కళ్ళు మూసుకుని వుండచ్చు" అన్నాడు.

నేను గొంతు సవరించుకుని "మీరు చాలా ఫాస్ట్‌గా వున్నారు మావయ్యా. లెట్ అజ్ థింక్ ఫర్ ఎ వైల్. ఇంత త్వరగా నిశ్చయించుకునే విషయం కాదిది" అన్నాను.

"మీ అత్తయ్యని పెళ్ళి చూపుల్లో చూసిన క్షణమే నిశ్చయించుకున్నాను నేను" అన్నాడు మావయ్య.

"ఈ ముసలి మాటలు వాళ్ళకి ఇష్టం వుండవు" అంది అత్తయ్య.

నేను టాపిక్ సినిమాలు వైపు డైవర్ట్ చేసి, అత్తయ్యతో వంట గదిలోకి వెళ్ళాను డిన్నర్ ప్రిపరేషన్స్‌కి.

ద్వారక చాలా ఇబ్బంది పడి వుంటాడు, ఇలా సడెన్‌గా పెద్దవాళ్ళు దాడి చేసేసరికి అనుకున్నాను.

మరునాడు అత్తయ్యా నేనూ షాపింగ్‌కి వెళ్తున్నాం అని తెలిసి "నేనొచ్చి తీసుకెళ్తాను" అన్నాడు ద్వారక. నేను హేపీగా ఫీల్ అయ్యాను.

అత్తయ్యా నేను షాపింగ్‌లో చాలా కొన్నాం. ద్వారక నాకోసం ఐ ఫోన్ కొన్నాడు. నేను చాలా మొహమాట పడ్డాను తీసుకోవడానికి. "నాదంతా నీదేగా. మనసు మార్చుకున్నావా ఏవిటీ?" అని జోక్ చేసాడు

"నేను నీకేం ఇవ్వలేనుగా" అన్నాను.

"నువ్వు నిన్నే నాకిచ్చావ్. ఆ ఆనందాన్ని మెటీరియల్ వస్తువులతో పోల్చగలమా?" అన్నాడు.

ఎంతో సెవ్వన..ఏవిటో లాలన.. భావుకత్వం లేకపోయినా చాలా స్పందనలున్న మనిషి.

అత్తయ్య నానమ్మ కోసం కోటూ, బి.పి ఆపరేటస్, అమ్మకోసం జెడ్స్, కోరల్స్, కిచెన్‌లో సాధనాలూ. డాడీ కోసం షర్ట్స్, స్మార్ట్ వాచ్. ఇలాంటివి నా పెట్టెనిండా కొనిచ్చింది. నేనూ నా శక్తి మేరా యాషికాకీ నాకూ డ్రెసెస్, అందరికీ ఇష్టమైన చాక్‌లెట్స్, డ్రై ఫ్రూట్స్ కొన్నాను.

ద్వారక అత్తయ్యని ఏ చిన్న ప్యాకెట్ కూడా పట్టుకోనివ్వలేదు. ఆవిడకి ఇష్టమైన బనానా స్ప్లిట్ ఐస్ క్రీం తినిపించాడు. జాక్ ఇన్ ద బాక్స్‌లో ఎలోపినా పెప్పర్స్ అంటే మన మిర్చీ బజ్జీలాంటివి కొని పెట్టాడు. పెప్పర్స్‌లో చీజ్ నింపి, ఫ్రీజ్ చేసి మన ముందు పిండిలో ముంచి వేయించి వేడి వేడిగా ఇస్తాడు. చాలా నచ్చాయ్ నాకు.

బోలెడు రోజెస్ కొన్నాడు. నాకు పింక్, అత్తయ్యకి వైట్ రోజెస్ ఇచ్చాడు.

"ధీరజ్ గుర్తొస్తున్నాడు" అత్తయ్య స్వరంలో బాధ ధ్వనించింది.

"సఖినేటిపల్లా?" అడిగాను అత్తయ్యని.

"అక్కడకి దగ్గర్లోనే వుంటారు వాళ్ళమ్మా, తాతయ్యా" అంది అత్తయ్య.

"నాకు ఎడ్రెస్ ఇస్తావా?" అడిగాను.

"ఫోన్ నెంబర్ ఇస్తాను" అంది.

ద్వారక నన్ను ఇంటి దగ్గర దింపి, లోపలికి రమ్మంటే చెప్పాడు. "ఐ హేవ్  టు క్యాచ్ ఎ ఫ్లయిట్ ఎర్లీ ఇన్ ద మార్నింగ్. మళ్ళీ ఎల్లుండి కలుద్దాం. ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళడానికి జస్ట్ పోర్ట్‌లాండ్ వెళ్ళొస్తా బిజినెస్ పనిమీద.." అని.

"ఓ.కే గుడ్ నైట్" అన్నాను.

అత్తయ్య కూడా బై చెప్పి లోపలికి వెళ్ళేదాకా నా చేతిని గట్టిగా పట్టుకుని వుంచాడు. తరువాత కార్ డోర్ తీసి, నన్ను లాగి, ముద్దు పెట్టుకున్నాడు "ఐ మిస్ యూ. త్వరగా ఇంట్లో చెప్పి వచ్చెయ్" అన్నాడు.

"నువ్వు రావా?" అడిగాను.

"రాత్రి గుర్తు చేసుకో.. మరునాటి రాత్రికల్లా నీ బెడ్‌లో వుంటా" అన్నాడు.

"ఛీ.." అన్నాను.

"ఇష్టమైన వాటిని ఛీ అంటారా?" అడిగాడు.

"బై" అన్నాను.

ఐదు నిమిషాల తర్వాత నన్ను వదులుతూ 'బై' చెప్పాడు.

పొద్దుట లేచి తయ్యారయి, అత్తయ్యా, మావయ్యతో "ద్వారక ఇంటికి వెళ్ళొస్తాను. ఓ సారి దేవకీ అంటీని కలవాలి" అని చెప్పి, లిఫ్ట్‌లో కార్ బుక్ చేసి బయల్దేరాను.

చిలకపచ్చ చీరకి ఎరుపు రంగు అంచూ, చెవులకి ముత్యాల బుట్టలూ, మెడలో సింపుల్‌గా డైమండ్ లాకెట్‌తో సన్నని చైన్, జడ వేసుకుని, అందులో ఒక గులాబీ పెట్టుకున్నాను. ప్రోపర్ ఆడపిల్ల వేషం అన్నమాట.

లూసీ తలుపు తీసి నవ్వుతూ విష్ చేసింది. అమెరికాలో డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే నాకు ఇష్టం. పనివాళ్ళని కూడా మిసెస్ వింగెట్.. మిస్ లూసీ. అని మర్యాదగా పిలవడం, మన పక్కన కూర్చోపెట్టుకుని భోజనం పెట్టడం అవన్నీ ఒక సంస్కారాన్ని సూచిస్తాయి. అలాగే 'లా' చదివే అమ్మాయిలు కూడా పెద్దవాళ్ళని చూసుకునే పనికి కుదరడం, బేబీ సిట్టింగ్ చెయ్యడం అన్నీ చాలా మంచి విషయాలు.

దేవకిగారు ఇంకా నైట్ డ్రెస్‌లోనే వున్నారు. బాల్కనీలో సూర్యుడికి నమస్కారాలు చేస్తూ కనిపించారు.

"ఆంటీ..." అనగానే, నన్ను చూసి ఆనందంగా "వాట్ ఎ సర్‌ప్రైజ్ డార్లింగ్?" అన్నారు.

ఇద్దరం హగ్ చేసుకున్నాం.

"కాఫీ తాగుతావా? నాతో లంచ్ చేస్తావా?" అడిగారు.

"అన్నీ చేస్తా.. కానీ ముందు మీతో మాట్లాడ్తా. తరువాత నేనే వంట చేస్తా" అన్నాను.

"ష్యూర్" అన్నారావిడ.

నేను ఆవిడ మంచం పక్కనున్న చైర్‌లో కూర్చున్నాను. ఆవిడ లూసీని పిలిచి, బయట ఏవైనా పనులుంటే చేసుకు రమ్మన్నారు. పోస్ట్ ఆఫీస్‌లో పనుంది అంటూ లూసీ రయ్యిన తన కారు తీసుకుని వెళ్ళిపోయింది.

మా ఇంట్లో పని చేసే వరాలు ఇలా "పనుంది ఇప్పుడే వస్తా" అని కార్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయే రోజు ఇండియాలో ఎప్పుడొస్తుందో కదా! అనుకున్నాను.

"చెప్పు!" అన్నారావిడ రిలాక్స్‌డ్‌గా వెనక్కి వాలి నేను గొంతు సవరించుకుని "ఏమీ అనుకోనంటే కొన్ని విషయాలు అడుగుతా" అన్నాను.

"అత్తగా నేను పనికి వస్తానా లేదా అని ఇంటర్వ్యూ చేస్తున్నావా?" నవ్వుతూ అడిగారు.

"నేను మిమ్మల్ని అత్తగా కాదు అమ్మగానే అనుకుంటున్నా. అందుకే కొన్ని విషయాలు అడగాలని వచ్చాను" అన్నాను.

మధ్యాహ్నం మూడు అవుతుండగా, నీట్‌గా అన్నీ ఒకే సైజ్‌లో కట్ చేసి పెట్టిన వెజిటబుల్స్ ఫ్రిజ్‌లోంచి తీసి, బీన్స్ కేరట్ కర్రీ, టొమేటో పెరుగు పచ్చడీ, ములక్కాడ సాంబార్ చేసా. నేను వంట చేస్తున్నంత సేపూ దేవకిగారు ఎన్నో కబుర్లు చెప్తూనే వున్నారు.

ఇద్దరం లంచ్ చేసాకా, "ఇంక నేను వెళ్ళొస్తా అన్నాను.

దేవకిగారు నన్ను, తనని బీరువా దగ్గరకి తీసుకెళ్లమని, అది తీసాకా, అందులోంచి ఒక భరిణ తీసి నా చేతికి ఇచ్చారు.

భరిణ తీసి ఆశ్చర్యపోయాను. అందులో ఒక ఉంగరం వుంది .మొదట రెండు రాళ్ళూ, మధ్యలో మూడూ, మళ్ళీ రెండూ వున్న రవ్వల వుంగరం చాలా బావుంది.

"దేవేంద్ర నాకు అప్పట్లో ఇచ్చిన వుంగరం. నీకు ఇవ్వాలని పిస్తోంది. కాదనకు" అందావిడ.

"రేపు ఒకవేళ నేను మీ కోడలు కాలేకపోతే.. ఇంకొకరు వస్తే ఆ ప్లేస్‌లోకి?" అన్నాను.

"అయినా సరే! నన్ను తలుచుకో. అది పెట్టుకుని" అన్నారావిడ.

ఇలాంటప్పుడు సినిమాల్లో వంగి కాళ్ళకి దణ్ణం పెడ్తారు. అలా చెయ్యనా? వసుంధర ఒకవేళ అలా చెయ్యమని చెపితే ఇంతెత్తున ఎగిరి పడ్తాను. మరి ఇప్పుడు ఎందుకిలా చెయ్యాలనిపిస్తోందీ? దేవకిగారి మీద ప్రేమా? లేక చిన్నప్పటినుండీ విసుక్కుంటూనో, కసురుకుంటూనో ఇలా అమ్మా వాళ్ళు చెప్పినట్లు చెయ్యడం వల్లా? లాజిక్‌కి అందలేదు. ఒంగి ఆవిడ్ని హగ్ చేసుకున్నాను.

"బి హేపీ" అన్నారావిడ.

అంతకన్నా పెద్ద ఆశీర్వాదం కూడా లేదు.

"బీ ఇన్ టచ్" నా చేతిని ముద్దు పెట్టుకుంటూ అన్నారు. ద్వారకని కన్నతల్లి ఆవిడ అందుకే ప్రేమ నా గుండెల్లో పొంగు కొచ్చింది.

లూసీ తన పని చూసుకుని వచ్చిన తర్వాత తన బ్రెడ్‌తో, నేను చేసిన కర్రీ తిని, "ఇట్స్ సింప్లీ డెలీషియస్.. ఆ .. ఐ లవ్ ఇట్!" అని చాలా హావభావాలతో నా వంటని మెచ్చుకుంది.

దేవకిగారిచ్చిన చిన్న భరిణలో ఉంగరంతో బాటు ఎన్నో బంధాలనీ అనుబంధాలనీ కూడా వుంచి మూత పెట్టి ఇచ్చారనిపించింది.

కానీ నా ముందో పెద్ద ప్రశ్నార్థకం వుంది. దాన్ని ఛేదించాలి.

అత్తయ్యతో ఆ రాత్రి పరిమళ, అల్విన్‌తో ప్రేమలో లేదు. కేవలం స్నేహం. చూస్తుండగా ఏడాది కాలం పరిగెత్తి పోతుంది. మళ్ళీ మన పరి మన దగ్గరకి వచ్చేస్తుంది. పెళ్ళి కూతురవుతుంది. మీకు మనవలని ఇస్తుంది. అని ఎంతో ధైర్యం చెప్పాను.

"కానీ ధీరజ్ నా అల్లుడు అవడుగా? నా అరవిందతో నా స్నేహం, వియ్యంగా మారదుగా. మాస్టారుగారికి దీని విషయం తెలిసి ఇప్పటికే ఎంత అసహ్య పడుంటారో నా పెంపకం మీద" అని కంట తడి పెట్టుకుంది అత్తయ్య.

"ధీరజ్ పరిని కాదని మందాకిని ఎందుకు చేసుకుంటాడు అత్తయ్యా? ఊరికే అలిగి బెదిరింపు అంతే" అన్నాను.

"అంతేనంటావా?" ఆక్సిజెన్ పెట్టినట్లు, ఆవిడ ఊపిరి పీల్చుకుంటూ అడిగింది.

"అంతే" అన్నాను.

మావయ్య ఎప్పుడొచ్చాడో గదిలోకి. అంతా విన్నట్లుగా నా తల మీద చెయ్యివేసి నిమిరి "మా క్రిష్ణయ్య అదృష్టవంతుడు నీలాటి కూతురు పుట్టింది" అన్నారు.

"పరి ఉత్త అమాయకురాలు కసురుకోకండి" అన్నాను.

"నువ్వు త్వరగా పప్పన్నం పెట్టించు" అన్నారు మావయ్య.

ఇదివరకైతే ఇలా ఎవరైనా పెద్దవాళ్ళు అనగానే, "మీ ఇంట్లో పప్పు వండుకోరా? మా ఇంట్లో పెళ్ళి అయితే తప్పా?" అనేదాన్ని.

ఇప్పుడు నాకు మెచ్యూరిటీ వచ్చింది. నవ్వి వూరుకున్నాను.

వసుంధర సంతోషించే పనులు చాలా చాలా నేర్చుకున్నాను అమెరికాకి వచ్చాక. అమ్మకి దూరంగా వుంటే ఆటోమేటిక్‌గా మెచ్యూరిటీ వచ్చేస్తుందేమో?

బాత్‌రూములోంచి "అమ్మా పైజామా నాడా లోపలికి వెళ్ళిపోయింది, తీసి పెట్టు"

"అమ్మా. నాకు ఆకలేస్తోంది కాని అన్నం కలుపుకోవాలని లేదు. కలిపి పెట్టూ!"

"అమ్మా కొంచె ఈ టాప్ ఇస్త్రీ చెయ్యి అర్జెంట్.."

"కాకరకాయ కూరా? నువ్వే తిను నేను చికెన్ తెప్పించుకుంటా స్విగ్గీలో"

"అమ్మా.. నీ స్లిప్పర్స్ నేను వేసుకెళ్తున్నా.. నువ్వు ఎక్కడకీ వెళ్లవుగా?"

"మమ్మీ నీ దేవుడి దగ్గర హుండీలోంచి ఫైవ్ హండ్రెడ్ తీసుకున్నా వెతుక్కోకు"

ఇలా అమ్మ ఎదురుగా వుంటే గారాలు, ఎన్నెన్నో పనులు చెప్తాం. అదే అమ్మ "కాఫీ" అనగానే, బెడ్ కాఫీ తీసుకురాదు అని తెలిసినప్పుడు బుద్ధిగా వుంటాం. దీన్నే మెచ్యూరిటీ అంటారేమో.

అమ్మ దగ్గర కాకపోతే ఇమ్మెచ్యూర్‌గా ఇంక ఎక్కడావుండలేం. ఎప్పుడు అమ్మని చూస్తానా అని అనిపించింది.

COMMENTS